నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, గురువారం 28 నవంబర్ 2024 | KAMAREDDY

మళ్లీ షురూ..

- శెట్‌పల్లి నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా
- అధికార పార్టీ నాయకులే సూత్రధారులు
- అధికారుల తీరుపై అనుమానాలు



ముప్కాల్ మండలం నాగంపేట్ శివారులో రెవెన్యూఅధికారి పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

మోర్తాడ్, నవంబర్ 27 : బాల్కొండ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా మళ్లీ ప్రారంభమైంది. 'సర్కారు ఆదాయానికి టెండర్' శీర్షికన నమస్తే తెలంగాణ ఇటీవల ప్రత్యేక కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు రోజుల పాటు ఇసుక అక్రమ తరలింపు ఆగిపోయింది. మళ్లీ ఏమైందో ఏమో.. ఎవరు చెప్పారో కానీ అక్రమ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. మోర్తాడ్ మండలం శెట్‌పల్లిలో బుధవారం ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగింది. ఇక్కడ అధికార పార్టీకి చెందిన నాయకులే ఈ అక్రమ దందాకు ప్రధాన సూత్రధారులు కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శెట్‌పల్లి పెద్దవాగు నుంచి రోజుకు వందలాది ట్రిప్పుల ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మోర్తాడ్ మండలంతోపాటు బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లోని గ్రామాలకు సరాఫరా చేస్తున్నారు. అయితే, ప్రభుత్వానికి ఎటువంటి రుసుము చెల్లించకుండా నడుపుతున్న అక్రమ ఇసుక రవాణాతో పెద్దమొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. శెట్‌పల్లి గ్రామం నుంచి బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ముప్కాల్ మండలం నాగంపేట శివారులో రెవెన్యూ అధికారి పట్టుకున్నారంటే ఎంత సాఫీగా అక్రమ రవాణా జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. శెట్‌పల్లి గ్రామం నుంచి ఇసుక రవాణాకు గ్రామ కమిటీకి ఒక్కో ట్రిప్పుకు రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. మోర్తాడ్ మండలంతోపాటు ఇతర మండలాల అధికారులకు ఇసుక వ్యాపారులు ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అధికారులకు భారీగానే అందుతుండడంతోపాటు అధికార పార్టీ నాయకులే ఇందులో ఉండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

ఇతర మండలాల్లో ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటుంటే, స్థానికంగా ఉన్న రెవెన్యూ, పోలీసు అధికారులు మాత్రం ఎందుకు కిమ్మనడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవలే జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్న పోలీసులు.. శెట్‌పల్లి నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతున్నా ఎందుకు నిలువరించలేక పోతున్నారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. మరోవైపు, అక్రమ తరలింపుపై అధికారులను ప్రశ్నిస్తే సరైన స్పందన ఉండడం లేదు. మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సుజాత సెలవులో ఉన్నారు. శెట్‌పల్లి పెద్దవాగు నుంచి అక్రమ ఇసుక రవాణా జరగుతున్న తీరుపై ఆర్ఐ రంజిత్‌ను వివరణ కోరగా.. శెట్‌పల్లి గ్రామం నుంచి ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. మరీ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో వెళ్తుంటే అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారుల కండ్లకు కనిపించకపోవడం గమనార్హం.

బీజేపీ సైలెన్స్

- కాడి వదిలేసిన కమలం
- ప్రజాసమస్యలపై కనిపించని పోరాటం
- హామీల అమలుపై నిలదీయడంలో వైఫల్యం
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రజానీకం
- నోరు తెరవని కాషాయ నేతలు
- మౌనం వెనుక ఆంతర్యమేమిటో?
- గతంలో నిప్పులు.. ఇప్పుడు నిశ్శబ్దం
- అలుపెరుగని పోరాటం చేస్తున్న బీఆర్ఎస్

నిజామాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కమల దళం కాడి వదిలేసింది. ప్రజా సమస్యలపై పోరాడకుండా చేతులెత్తేసింది. కాంగ్రెస్ పాలనలో జనం అనేక రకాలుగా చితికిపోతుంటే బీజేపీ మాత్రం సైలెంట్ మోడ్‌లోకి వెళ్లింది. ఆరు గ్యారంటీల అమలుపై రేవంత్ సర్కారును నిలదీయకుండా మౌనముద్ర దాల్చింది. ఏడాది క్రితం వరకు బీజేపీ నేతలు దూకుడు ప్రదర్శించారు. ప్రజల సంక్షేమం కోసం అనుక్షణం పాటుపడిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇష్టానుసారంగా నిప్పులు చెరిగారు. ప్రతి విషయంలోనూ శూల శోధన చేసి జనాల్ని ఆగమాగం చేశారు. రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు సైతం చేసి ప్రజలను మభ్యపెట్టారు. లేనిపోని కల్పిత ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టించే పనికి ఒడిగట్టారు. ఏమైందో ఏమో కానీ ఏడాది కాలంగా బీజేపీ మౌనవ్రతం ఆచరిస్తున్నది. ప్రజా సమస్యలను గాలికొదిలేసి సర్కారుతో స్నేహబంధం కొనసాగిస్తున్నది.

బీఆర్ఎస్ అలుపెరుగని పోరు..

ఆది నుంచి కాంగ్రెస్, బీజేపీపై బీఆర్ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తున్నది. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ఏకైక లక్ష్యంగా నిత్యం ప్రజా సమస్యలపై గళం విప్పుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతున్నది. ఆరుగ్యారంటీల హామీ అమలుపైనా నిలదీస్తున్నది. 11 నెలల పాలనలో కాంగ్రెస్ సర్కారును రోడ్డుకు ఈడ్చి ప్రజల్లో దోషిగా నిలబెట్టడంలో బీఆర్ఎస్ విజయవంతమైంది. కేసులకు భయపడకుండా, పోలీసుల వేధింపులను ధైర్యంగా ఎదుర్కొంటూ, గృహ నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా బీఆర్ఎస్ నేతలు ప్రజా పోరాటంలో ముందుంటున్నారు. సోయా రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు సమస్యపై బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గళమెత్తారు. ఆయన హెచ్చరికలతో స్పందించిన ప్రభుత్వం ఎకరానికి 6 క్వింటాళ్ల సీలింగ్‌ను 10 క్వింటాళ్లకు పెంచింది. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి సైతం ప్రజల్లోకి వెళ్తూ హామీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నారు. కానీ బీజేపీ నేతలు మాత్రం ప్రజా సమస్యలపై స్పందించడం లేదు. అధికార కాంగ్రెస్ నేతల ఆగడాలపైనా ప్రశ్నించడం లేదు. పైగా బీఆర్ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజల్లో నవ్వుల పాలవుతున్నారు.

మౌనం దాల్చడం విస్మయానికి గురి చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై కమల దళం పోరుబాట పట్టకపోవడంపై ప్రజల్లో చర్చ మొదలైంది. ఇన్ని సమస్యలు వెంటాడుతోన్న ప్రజల కోసం ఆశించిన స్థాయిలో గళం వినిపించకపోగా సైలెంట్ కావడంతో రాజకీయ వర్గాల్లోనూ చర్చ నడుస్తున్నది. చీటికి మాటికి సోషల్ మీడియాకు ఎక్కి గత ప్రభుత్వంపై నిందలు మోపిన ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇప్పుడు పత్తా లేకుండా పోయారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రెస్‌మీట్లకు మాత్రమే పరిమితమయ్యారు. ఆర్మూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వదిలేసి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఇతర అంశాలను భుజాన వేసుకుంటున్నారు. ఇలా బీజేపీ నేతల తీరుపై సొంత పార్టీలోనే జోరుగా చర్చ నడుస్తున్నది.

సైలెంట్ ఎందుకయ్యారు.. ?

అకస్మాత్తుగా బీజేపీ నేతలంతా సైలెంట్ కావడం వెనుక కారణం ఏమిటన్నది అంతు చిక్కడం లేదు. బీజేపీ అనుబంధ సంస్థ ఏబీవీపీ మాత్రమే విద్యార్థుల సమస్యలపై అడపాదడపా ఆందోళనలు చేస్తున్నది. హిందుత్వ పోరాటాలకు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కదం తొక్కుతున్నారు. ఒక రాజకీయ పార్టీగా రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా బీజేపీ మాత్రం అంతగా స్పందించకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. నిర్మల్ ఎమ్మెల్యేగా ఉన్న మహేశ్వర్ రెడ్డి తనదైన శైలిలో సర్కారును ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి ప్రభుత్వానికి రోజుకో విధంగా సవాళ్లు విసురుతున్నారు. అయితే, నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నప్పటికీ ఆ స్థాయిలో దాడి అన్నది మచ్చుకు కనిపించకపోవడం విడ్డూరంగా మారింది. వారు సైలెంట్ కావడం వెనుక అధిష్టానం ఆదేశాలు ఏమైనా ఉన్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ నేతల అధికార దర్పానికి అనేక చోట్ల బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కనీస మర్యాద దక్కడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం నిస్తేజంలో కొట్టుమిట్టాడుతున్నది. కాంగ్రెస్ నేతలకు ఇచ్చే మర్యాద కూడా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలకు ఇవ్వడం లేదు. ఇలాంటి గందరగోళం లోనూ బీజేపీ నేతలు మౌనంగా ఉండడమేమిటో అంతుబట్టడం లేదు.

రుద్రూర్ తహసీల్ కార్యాలయం ముట్టడి

పెన్షన్ పెంచాలని తహసీల్ ఆఫీస్ ముట్టడి

రుద్రూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

రుద్రూర్, నవంబర్ 27 : మండల కేంద్రంలో ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో దివ్యాంగులు తహసీల్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మీరాబాయికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. 6 వేలు పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీలో దివ్యాంగులకు 5 శాతం కేటాయించడంతోపాటు అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచి, కాలయాపన చేస్తూ దివ్యాంగులను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నవంబర్ 30న బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన, డిసెంబర్ 9న హైదరాబాద్‌లో దివ్యాంగులతో సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా ప్రధానకార్యదర్శి ఏశాల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు నజీర్, ఆరిఫ్, సాయిలు, శంకర్, సుభద్ర, నీలమణి, జగ్గు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి
- కేసీఆర్ త్యాగాలు గుర్తించేలా దీక్షాదివస్ వేడుకలు
- పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు

బాన్సువాడ రూరల్, నవంబర్ 27 : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, దీక్షా దివస్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దీవస్ నేపథ్యంలో బాన్సువాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ చేపట్టిన మలిదశ ఉద్యమం పునాదిగా, తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణలోని సబ్బండ వర్ణాలను ఏకం చేసి రాష్ట్ర సాధనకు తోడ్పడిందన్నారు.

తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివస్ నిలుస్తుందన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగిసి, స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. కేసీఆర్ త్యాగాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని, అందుకే దీక్షా దివస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కేసీఆర్ పాలనతో సుభిక్షంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం, కాంగ్రెస్ పాలనలో అరాచక పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అనవసర కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పని చేయకుండా, కేవలం తన కుటుంబసభ్యుల కోసమే పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. లగచర్లలో అమాయక గిరిజన మహిళలపై కేసులు నమోదు చేస్తే వారికి అండగా ఉంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో పాటు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు.

బీఆర్ఎస్‌తో పదవులు పొందిన కొందరు తమ స్వలాభం కోసం పార్టీ మారారన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. నాయకులు పార్టీ మారినా, కార్యకర్తలు మాత్రం అండగా ఉన్నారన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ నష్టం జరిగినా ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌పై ఇతర పార్టీలు చేస్తున్న విమర్శలను నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తూ పార్టీని ముందుండి నడిపించాలని కోరారు. 29న కామారెడ్డిలో జరిగే దీక్షాదివస్‌కు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం..

బాన్సువాడ గడ్డ బీఆర్ఎస్ పార్టీకి అడ్డా అని, త్వరలో జరిగే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ అన్నారు. జిల్లాలో గులాబీ జెండా ఎగురవేసి, కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. ప్రభుత్వం లేదని నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. కొందరు వెన్నుపోటు పొడిచి ఇతర పార్టీలలో చేరారని, వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి, వారే ప్రజాప్రతినిధులుగా ఎన్నిక అవుతారని అన్నారు. కేసీఆర్ సారథ్యంలో, కేటీఆర్ ఆధ్వర్యంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నేతలు మోచి గణేశ్, సాయిబాబా, అశోక్, గణేశ్, నాగరాజు, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

టీయూలో ఖాళీ సీట్లను భర్తీచేయాలి

వీసీ చాంబర్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకుల నిరసన

డిచ్‌పల్లి, నవంబర్ 27 : తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడంతోపాటు బీఈడీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని పీడీఎస్‌యూ, టీఎస్ఎస్ఎఫ్, టీజీవీపీ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టీయూలోని వీసీ చాంబర్ ఎదుట బుధవారం ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు డాక్టర్ పుష్పాల రవి, డాక్టర్ కర్క గణేశ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న సీట్లను వీసీలు భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాల నుంచి టీయూకి వచ్చిన విద్యార్థులకు వసతిగృహాన్ని ఇవ్వకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీ సీట్లను భర్తీ చేసేలా చూడాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వీసీ చాంబర్ ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోవాలని ధర్నా

సిరికొండ తహసీల్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న రైతులు, ఏఐకేఎంఎస్ నాయకులు

సిరికొండ, నవంబర్ 27: వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు, ఏఐపీకేఎంఎస్ నేతలు బుధవారం సిరికొండ తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

రైతులు, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ముట్టడి

కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రూ.12 వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు భారీ ర్యాలీగా వెళ్లి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రామకృష్ణ, నాయకులు రమేశ్, దామోదర్, సాయారెడ్డి, కిశోర్, బాలిరెడ్డి, ఎర్రన్న, ఆశీష్, కైలాశ్, బాబన్న, లింబాద్రి, గంగమల్లు, అనీష్ తదితరులు పాల్గొన్నారు.